'సౌర విద్యుత్ వినియోగదారులకు బ్యాంక్ రుణం'

మండవల్లి : సౌర విద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు సబ్సిడీతో పాటు తక్కువ వడ్డీకి బ్యాంకు నుంచి రుణం అందిస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఎలిస్.భాస్కరరావుకు, చింతపాడుకు చెందిన ముంగర తిరుపతి వెంకన్నకు కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.78 వేల చెక్కులను బుధవారం ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వారి అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో సూర్య ఘర్ పథకం ఒకటని అన్నారు. ఈ పథకం ద్వారా గృహాలలో వెలుగులు నింపడం, విద్యుత్ ఖర్చులు తగ్గించడం వంటి మంచి ప్రయోజనాలతో మోడీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ పరికరాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆయన కోరారు.

పంచాయతీల్లో వెండర్ మాయాజాలం..!

ఇ-గ్రామస్వరాజ్‌లో ఇష్టానుసారంగా వెండర్ అకౌంట్లు

ఒకే వ్యక్తికి ఒకచోట ఉద్యోగిగా, మరికొన్ని చోట్ల రెంటర్‌గా ఖాతాలు

నిడమర్రు మండలం క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రుల్లో వెండర్ ఖాతాలపై విస్మయం

మూడు పంచాయతీల్లోనూ ఒకరికే ఉద్యోగి, రెంటర్ ఖాతాలు

రూ.లక్షల సొమ్ము జమపై పలు అనుమానాలు



Village: Krovvidi

S.No.	Vendor	Vendor Type
1	AAO ERO TPG	Agency
2	CHODAVARAPU SAMSONU RAO	Employee
3	EESL	Agency
4	EESWARAPU RAMATULASI	Employee
5	KURMA RAMESH	Employee
6	MOLAGAJJALA YESU	Employee
7	MOTEPALLI VENKATA LAKSHMI	Employee
8	PALANKI SARSWATHI	Employee
9	Ravipati Madhavi Latha	Employee
10	Ravipati Srinivasa rao	Citizen

క్రొవ్విడి ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో ఉద్యోగులుగా మోటేపల్లి వెంకటలక్ష్మి, రావిపాటి మాధవీలత



7	Motepalli Venkata Lakshmi	Citizen
8	Ravipati Madhavi Latha	Citizen

Report generated through eGramSwaraj (http://egramswaraj.gov.in) on Mon, Jan 06, 2025 17:41:05 PM

మందలపర్రు ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో సిటిజన్లుగా మోటేపల్లి వెంకటలక్ష్మి, రావిపాటి మాధవీలత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామాల అభివృద్ధికి వెన్నుముకగా నిలవాల్సిన పంచాయతీల్లో నిధుల ఖర్చుకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తన శాఖను ప్రక్షాళ చేసి గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవలందించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు పదేపదే చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు జిల్లాల్లోని పంచాయతీలకు రూ.వంద కోట్లకుపైగా వచ్చాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల్లోని అభివృద్ధి పనులకు సక్రమంగా వినియోగించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రత్యేకంగా తెరిచిన ఇ-గ్రామస్వరాజ్‌లో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా వెండర్ అకౌంట్లు తెరిచి నిధులు జమ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెండర్ ఖాతాలకు నిధుల జమపై గ్రామాల్లో విస్తృతమైన చర్చ నడుస్తోంది. నిడమర్రు మండలంలోని క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీలకు సంబంధించి ఇ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో తెరిచిన వెండర్ ఖాతాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. ఈ మూడు పంచాయతీలకు కార్యదర్శి ఒక్కరే. క్రొవ్విడి పంచాయతీలో మోటేపల్లి వెంకటలక్ష్మి ఉద్యోగి (ఎంప్లాయి) కింద వెండర్ ఖాతా ఉండగా, మందలపర్రు, గుణపర్రు పంచాయతీల్లో రెంటర్ (సిటిజన్), వెండర్ ఖాతాలు ఉన్నాయి. రావిపాటి మాధవీలత పేరు క్రొవ్విడిలో ఉద్యోగిగా, మిగిలిన రెండు పంచాయతీల్లో రెంటర్‌గా ఖాతాలు ఉన్నాయి. ఒక పంచాయతీలో ఉద్యోగి ఖాతాగా సొమ్ము జమవుతుండగా, మరో పంచాయతీలో రెంటర్ ఖాతాగా నిధులు జమవుతున్నాయి. ఒక వ్యక్తి ఒకచోట ఉద్యోగిగా, మరోచోట రెంటర్‌గా ఏవిధంగా ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సదరు వ్యక్తులు క్రొవ్విడి పంచాయతీలో ఉద్యోగులుగా ఉన్నారా అనే విషయాలనుసైతం అధికారులు తేల్చాల్సి ఉంది. క్రొవ్విడి పంచాయతీలో మోటేపల్లి వెంకటలక్ష్మి వెండర్ ఖాతాలోకి దాదాపు రూ.పది లక్షలకుపైగా సొమ్ము 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో జమ కావడం ఆశ్చర్యం కల్గిస్తోంది. ఇంకా చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్ ఉన్నట్లు ఇ-గ్రామస్వరాజ్ ఖాతాలో చూపిస్తున్న పరిస్థితి ఉంది. ఇదేవిధంగా మందలపర్రు, గుణపర్రు పంచాయతీల్లోనూ నిధుల జమ సాగింది. గుణపర్రులో మోటేపల్లి వెంకటలక్ష్మి పేరున 2024 మార్చిలో రూ.24 వేలకుపైగా బిల్లు తాగునీటి కింద ఖర్చు పెడితే తిరస్కరణకు గురవ్వగా, ఏప్రిల్‌లో జీతాల పేరుతో బిల్లు పెట్టి క్లియర్ చేసుకున్నట్లు ఇ-గ్రామ స్వరాజ్ ఖాతాల్లో చూపిస్తోంది. క్రొవ్విడిలో ఉద్యోగిగా ఖాతా ఉన్న రావిపాటి మాధవీలతకు మందలపర్రు పంచాయతీ వెండర్ ఖాతాల్లో ఒకేసారి రూ.94,900 బిల్లు చెల్లింపు జరిగినట్లు చూపిస్తోంది. మరోవ్యక్తి రావిపాటి శ్రీనివాసరావు పేరున క్రొవ్విడిలో వెండర్ ఖాతా ఉంది. ఒకే ఇంటి పేరున ఉన్న వ్యక్తుల పేర్లపై వెండర్ ఖాతాలు ఉండటంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇ-గ్రామస్వరాజ్ వెండర్ ఖాతాలపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తేనే అసలు విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ పంచాయతీల్లో పలు అంశాలపై సమాచారం హక్కుచట్టం ద్వారా దరఖాస్తు చేసినా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితులు సైతం ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో తమకు అనుకూల వ్యక్తులు ఉన్నారని, తమకు ఏమీ కాదనే ధీమాతోనే వారు ఈ విధంగా ముందుకు సాగుతున్నారనే ప్రచారం సాగుతోంది. దీనిపైనా ఉన్నతాధికారులు విచారించి పంచాయతీల్లోని ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమయ్యాయో, లేదో తేల్చాల్సి ఉంది.

వెండర్ ఖాతాలను తనిఖీ చేస్తారా?

ఏలూరు జిల్లాలో 27 మండలాల్లో 547, పశ్చిమగోదావరిలో 20 మండలాల్లో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు విడతలుగా రెండు జిల్లాల్లోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.వంద కోట్లకుపైగా విడుదలయ్యాయి. పంచాయతీల్లో ఆ నిధులు ఏ పనులకు ఉపయోగిస్తున్నారో తనిఖీలు మాత్రం ఉండటం లేదు. వెండర్ ఖాతాలపై పంచాయతీల్లో తనిఖీలు నిర్వహిస్తే చాలా విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పంచాయతీ అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి. ప్రతియేటా పంచాయతీల్లో ఆడిట్ ప్రక్రియ జరుగుతోంది. అక్కడ వెండర్ ఖాతాలను ఏవిధంగా గుర్తించలేదో అర్థం కావడంలేదు. వెండర్ ఖాతాలు నిబంధనల ప్రకారం ఉన్నాయో, లేదో కూడా తేల్చాల్సి ఉంది.

విచారణ చేసి నిజమని తేలితే చర్యలు

కెవి.చంద్రశేఖర్, డిఎల్‌పిఒ

ఉద్యోగి పేరున వెండర్ అకౌంట్ చేయడం నిబంధనలకు విరుద్ధం. 15వ ఆర్థిక సంఘం నిధులు శాశ్వత పనులకు ఖర్చు పెట్టాలి. క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీల వెండర్ ఖాతాల విషయం నా దృష్టికి రాలేదు. విచారణ చేసి నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.

కొనసాగిన పెసా కమిటీ ఎన్నికలు

పలుచోట్ల కోరం లేక వాయిదా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలో రెండో రోజు బుధవారం పెసా కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో బుధవారం 20 కమిటీల ఎన్నికలు జరగాల్సి ఉండగా రెడ్డిగణపవరంలో నిర్వాసిత గ్రామాల ప్రజలకు, స్థానిక ప్రజలు తమకు వేర్వేరుగా కమిటీల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీంతో అక్కడ ఎన్నిక జరగలేదు. పాలకుంటలోనూ, కోయరాజమండ్రి, రావిగూడెం గ్రామాల్లోనూ, కోటనాగవరంలోనూ కోరం లేనందున ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన 16 గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. రేగులకుంట పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా బాడిస బుజ్జియార, కార్యదర్శిగా నూప వీరభద్రం, వెలతురువారిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కట్టం చిన్న మంగరాజు, కార్యదర్శిగా గుజ్జు రమేష్‌బాబు, జైనవారిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా మిడియం నాగేంద్రబాబు, కార్యదర్శిగా ఎరప అన్నపూర్ణరావు, వేపులపాడు, సీతారామనగరం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా తప్పి గంగరాజు, కార్యదర్శిగా మడకం వెంకటేశ్వరరావు, కామయ్యకుంట, బండార్లగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కోవాసి పోసిరావు, కార్యదర్శిగా పినబాలి కుమారి, లంకపాకల పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా వంగా రాముడు, కార్యదర్శిగా మడివి దుర్గారావు, పండుగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా మడకం చంద్రరావు, కార్యదర్శిగా బక్క ధర్మరాజు, కామవరం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా గుజ్జ రామారావు, కార్యదర్శిగా తెల్లం రమేష్, కొర్సవారిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా పూనెం నాగేశ్వరరావు, కార్యదర్శిగా కారం వెంకటేష్, మోతుగూడెం, తానిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా గోగుల వెంకటరెడ్డి, కార్యదర్శిగా గోగుల చెన్నయ్య, వేపులపాడు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కాకి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చోడెం వీరాస్వామి, కోయ అంకంపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా తెల్లం గంగాధరరావు, కార్యదర్శిగా తెల్లం శ్రీనివాసరావు, మెట్టగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా మొడియం రాజశేఖర్, కార్యదర్శిగా తామా ముత్యాలమ్మ, అమ్మపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా అన్నిక వెంకటస్వామి, కార్యదర్శిగా పూనెం దుర్గారావు, కోట రామచంద్రపురం, ఎర్రాయిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కాకి బ్రహ్మదేవుడు, కార్యదర్శిగా మడకం వీరాస్వామి, చంద్రయ్యగూడెం, మెట్టగూడెం కమిటీ ఉపాధ్యక్షులుగా పోడియం కొవ్వాడయ్య, కార్యదర్శిగా తాటి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారని ఎంపిడిఒ జ్యోతి తెలిపారు.

జీలుగుమిల్లి: మండలంలో రెండోరోజు బుధవారం పెసా కమిటీ ఎన్నికలు కొనసాగాయి. తొమ్మిది గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా రెండు గ్రామాల్లోనే ఎన్నికలు జరిగాయి. బొత్తప్పగూడెంలో ఉపాధ్యక్షుడిగా ఊకె వెంకటేశ్వరావు, కార్యదర్శిగా ఎం.సుప్రియ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నిఖిల్ మధుశరణ్ తెలిపారు. లంకాలపల్లి, తాటిరాముడుగూడెం గ్రామాలకు కలిపి ఎన్నిక జరగ్గా ఉపాధ్యక్షులుగా కణితి సంకురు, కార్యదర్శిగా కూరం గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నవీన మణిమాల తెలిపారు. జిల్లెళ్లగూడెం, రాచన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి, రౌతుగూడెం, పి.రాజవరం, తాటియాకులగూడెం, గోపాలపురం, స్వర్ణవారిగూడెం గ్రామాల్లో సరిపడా ఓటర్లు లేకపోవడంతో కోరం సరిపోక ఎన్నిక రద్దయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నిర్వాసిత గ్రామాలైన టేకూరు, శివగిరి, గాజులగొంది, కొత్తూరు గ్రామస్తులు ఎన్నికలకు హాజరు కాలేదు. ఆయా గ్రామాల్లో తమకు ప్రత్యేకంగా పెసా కమిటీల ఎన్నిక నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశామని, అందువల్లే తాము ఎన్నికలకు హాజరు కాలేదని చెప్పినట్లు ఎన్నికల అధికారి కె.గంగాధర్ తెలిపారు.

పోలవరం: మండలంలో చింతపల్లి, కోయనాగంపాలెం పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైందని డిప్యూటీ తహశీల్దార్ కంభంపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యక్షునిగా వల్లా దుర్గారెడ్డి, కార్యదర్శిగా చంద్రు సురేందర్‌రెడ్డి, కోయనాగంపాలెం ఉపాధ్యక్షులుగా మడివి చలపతిరావు, కార్యదర్శిగా గిన్నెపల్లి వీరపరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

కుక్కునూరు రూరల్: మండలంలో బుధవారం పెసా కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మారేడుబాక పెసా కమిటీ ఉపాధ్యక్షునిగా కంటిపల్లి పాండురాజు, కార్యదర్శిగా చుట్టి నాగేంద్రబాబు, నల్లకుంట కమిటీ ఉపాధ్యక్షునిగా పూనం రాముడు కార్యదర్శిగా కొవ్వాసి నాగార్జున, కుక్కునూరు ఉపాధ్యక్షుడిగా ఊకే భద్రయ్య, కార్యదర్శిగా మడకం వెంకటేశ్వర్లు, కివ్వాక కమిటీ ఉపాధ్యక్షునిగా పొడియం రమేష్, కార్యదర్శిగా మొడియం సీతారాములు, బర్లమడుగు కమిటీ ఉపాధ్యక్షునిగా పెనుబల్లి ముత్యాలు, కార్యదర్శిగా పెనుబల్లి బాబు ఎన్నికయ్యారని ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు. కోరం లేనందున మండలంలోని ఇసుకపాడు, వింజరం గ్రామాల్లో కమిటీ ఎన్నికలు వాయిదాపడ్డాయి.

వేలేరుపాడు రూరల్: పెసా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వేలేరుపాడు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కారం ఎం.కుమార్, కార్యదర్శిగా మడకం శ్రీకాంత్, రేపాకగొమ్ము ఉపాధ్యక్షులుగా తెల్లం వెంకట వినోద్‌కుమార్, కార్యదర్శిగా కుడియం శివరాజు, మద్దిగట్ల కమిటీ ఉపాధ్యక్షులుగా బీరబోయిన ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా సోడే ముత్యాలరావు, బురెడ్డిగూడెం కమిటీ ఉపాధ్యక్షులుగా నూప ముత్తయ్య, పూనెం బాబురావు, కట్కూరు కమిటీ ఉపాధ్యక్షునిగా కెచ్చల రామారావురెడ్డి, కార్యదర్శిగా గునుగుంట్ల రమేష్‌రెడ్డి, కన్నాయిగుట్ట కమిటీ ఉపాధ్యక్షులుగా కారం బొజ్జి, కార్యదర్శిగా ఊకె సాగర్, కొత్తూరు కమిటీ ఉపాధ్యక్షులుగా పండా విష్ణు, కార్యదర్శిగా ఊకె సాగర్, బోళ్లపల్లి కమిటీ ఉపాధ్యక్షులుగా కెచ్చల భూమిరెడ్డి, కార్యదర్శిగా గడుపుల శివయ్య, పడమటమెట్ట కమిటీ ఉపాధ్యక్షులుగా పిసోడి తమ్మయ్య, నూపా సాయివర్ధన్ ఎన్నికయ్యారని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి తెలిపారు. రుద్రంకోటలో కోరం సరిపోక ఎన్నికలు నిలిచాయి.

'జలజీవన్ మిషన్' పనులపై ఆగ్రహం

జెడ్‌పి స్టాండింగ్ కమిటీల్లో అధికారుల తీరుపై ఎంఎల్‌ఎలు అసహనం

రోడ్ల పనులు ఆలస్యంపైనా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జలజీవన్ మిషన్ పనుల్లో జాప్యంపై ఎంఎల్‌ఎలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలు బుధవారం జరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన సాగిన ఈ సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎలు పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, బడేటి చంటి, మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తోపాటు ఇతర ప్రజా ప్రతినిధులు జలజీవన మిషన్ పనులపై మాట్లాడారు. పైపులు వేసి వదిలేశారని, పనులు చేయకపోయినా కాంట్రాక్టర్లను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవసరమైతే టెండర్లు రద్దుచేసి కొత్తగా పిలిచి పనులు ముందుకు సాగించాలన్నారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతికి రోడ్లపై గుంతలు పూడ్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండగా ఇంకా అనేక రోడ్ల పనులు పూర్తి కాలేదన్నారు. ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. పనుల ఆలస్యంపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పలు అభివృద్ధి పనులపై చర్చ సాగింది. వైసిపి సభ్యులు ఛైర్‌పర్సన్‌పై గుర్రుగా ఉండటంతో సమావేశాలు సాఫీగా సాగుతాయా అనే అనుమానాలు నెలకొన్నాయి. కోరం ఉండటంతో ఇబ్బంది లేకుండా పోయింది. దీంతో పలు బిల్లులకు ఆమోదం లభించింది. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జెడ్‌పి స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న విప్ బొలిశెట్టి శ్రీనివాస్

దేహదారుఢ్య పరీక్షల్లో అపశృతి

విరిగిన అభ్యర్థి కాలు

గాయపడిన చంద్రశేఖర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో 1600 మీటర్ల పరుగు పందెంలో ఒక అభ్యర్థికి కాలు విరిగిన ఘటన ఏలూరు జిల్లా పోలీస్ మైదానంలో బుధవారం చోటుచేసుకుంది. గత నెల 31వ తేదీ నుండి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పర్యవేక్షణలో సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో ఈ అపశృతి చోటుచేసుకుంది. 1600 మీటర్ల పరుగు పందెంలో నిర్ణీత సమయంలో వారు గమ్యాన్ని చేరుకుంటే వారు అర్హత సాధించినట్లు ప్రకటిస్తారు. బ్యాచ్ నెంబర్-12లో ఏలూరు లంకపేట ప్రాంతానికి చెందిన ఎం.చంద్రశేఖర్ (22) 1600 మీటర్ల పరుగు పందెంలో పరిగెడుతూ ఒక్కసారిగా కుప్పకూలాడు. సిబ్బంది అప్రమత్తమై సపర్యలు చేసి చికిత్సకు తరలిస్తుండగా కాలు విరిగినట్లు గుర్తించారు. హుటాహుటీన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. సరైన ప్రాక్టీస్ లేకపోవడం, లేదా ఫిజికల్‌గా ఫిట్ లేకపోవడం వల్ల పరుగు పెడుతున్నప్పుడు కాళ్లు విరుగుతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్‌ను ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. బుధవారం నిర్వహించిన ఫిజికల్ టెస్టులకు ఆరొందల మంది హాజరు కావాల్సి ఉండగా 459 మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో 313 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. గురువారం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులకు చివరి రోజు కావడంతో ఇప్పటి వరకు హాజరుకాని అభ్యర్థులు ఎవరైనా సరే గురువారం పాల్గొనవచ్చని ఎస్‌పి సూచించారు.

పెసా కమిటీ ఎన్నిక నిర్వహణపై అభ్యంతరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పెసా కమిటీ ఎన్నికను రెవెన్యూ గ్రామంలో నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు తెల్లం శంకరుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. రమణక్కపేటలోని పలు గిరిజన భూములు రామన్నపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్నాయని అన్నారు. ఆ గ్రామాన్ని తాటియాకులగూడెం పంచాయతీలో కలిపి ఎన్నిక నిర్వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రామన్నపాలెం రెవెన్యూ గ్రామంలో రమణక్కపేటను కలిపి పెసా కమిటీ ఎన్నిక నిర్వహించాలని అధికారులను వేడుకున్నారు. ఈ సమస్యపై ఎన్నికల అధికారిని వివరణ కోరగా ఓటింగ్ వంకవారిగూడెం పంచాయతీలో ఉండటం వల్ల వంకవారిగూడెం పంచాయతీలో ఎన్నిక నిర్వహిస్తున్నామని తెలిపారు.

పౌష్టికాహార ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం

ఐసిడిఎస్ పీడీ కె.శారద

ప్రజాశక్తి - భీమడోలు

పౌష్టికాహార ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి అంగన్వాడీ కేంద్రాలు వేదికలుగా విస్తృతస్థాయి ప్రచారం చేయాలని ఐసిడిఎస్ ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.శారద కోరారు. ఆమె బుధవారం మండలంలో పర్యటించారు. సూరప్పగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని నెంబర్-1, నెంబర్-2 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అక్కడ వివిధ అంశాల గురించి భీమడోలు సూపర్‌వైజర్ నూర్జహాన్ బేగం పీడీకి వివరించారు. అనంతరం పీడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, కిశోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలతోపాటు పలువురుతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆపై ఎంపిక చేసిన కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పోషణ వాటికల్లో ఒకటైన సూరప్పగూడెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పెరటి తోటల పెంపకాన్ని పరిశీలించారు. అక్కడ సేంద్రియ ఎరువులతో ప్రత్యేకంగా సాగుతున్న కూరగాయలు, ఆకుకూరల తోటలను పరిశీలించారు. వాటిని మరింతగా తీర్చిదిద్దేందుకు తగు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజామణి, కల్పనతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న శారద

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి - మండవల్లి

వాస్తవికతతో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడం ద్వారా మంచి సమాజ నిర్మాణం ఏర్పడుతుందని ఉమ్మడి కృష్ణాజిల్లా మానవత కెరీర్ గైడెన్స్ ఛైర్మన్ ఆచార్య సుధా బత్తుల విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గుడివాడ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు వాస్తవికతతో కూడిన విజ్ఞానాన్ని అందించడానికి సహకరించాలని అన్నారు. విద్యార్థులకు వాస్తవాలను ఆచరింపచేయడం ద్వారా వారు కోరుకున్న విజయాలను సాధించడానికి ఉత్తమమైన మంచి మార్గం ఏర్పడుతుందని అన్నారు. స్వయం సమృద్ధికి అలవర్చుకోవాల్సిన పద్ధతులైన వినయ, విధేయ, మృదువైన భాష సత్సంగత్యం, సానుకూలత దృక్పథం, సమయపాలన, స్వీయ క్రమశిక్షణ మొదలగునవి విద్యార్థులు ఆచరించడం ద్వారా అద్భుతంగా విజయాలను అందుకోవచ్చునని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఉన్నత విద్య, వృత్తి విద్య, ఉద్యోగ, వ్యాపార పరిశ్రమల అవకాశాలను, విద్యార్థుల ప్రతిభకు సరిపడే కోర్సులను, సబ్జెక్టులను ఏవిధంగా ఎంచుకోవాలి, ఇంజనీరింగ్ మెడికల్ సైన్స్ కామర్స్ ఆర్ట్స్ విభాగాలలో గల అనేక ప్రత్యేక సబ్జెక్టులపై ఆయన విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులలో గత సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, మెమొంటోలను, ఆర్థిక ప్రోత్సాహాలను అందించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మానవత సంస్థ ఛైర్మన్ కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మండ్యం సత్యనారాయణ, కో ఛైర్మన్ గుర్రం శ్యాంకుమార్, సభ్యులు సయ్యద్ జమీల్ అహ్మద్, రత్నారావు, మండవల్లి మానవత కార్యదర్శి సమయం యేసు బాబు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న మానవత సభ్యులు

చింతలపూడి : విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తమ దినచర్యలు ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని, ఆ ప్రణాళిక ప్రకారం తమ దినచర్య ఉండాలని చింతలపూడి ఎంఇఒ-2 ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. కష్టపడి, మనసు పెట్టి చదివిన వారు మాత్రమే ఉత్తమ ర్యాంకులు సాధించగలుగుతారని ఆయన తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో బుధవారం చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. అనంతరం గత సంవత్సరం 9వ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వివేకానంద సూక్తులు, టేబుల్ స్పైరల్ డిస్‌ప్లే అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ పి.సోమశేఖరాచార్యులు, ఛైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ కె.నాగ చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పిఎస్.సుధాకర్, ఉపాధ్యాయులు కె.రమేష్ పాల్గొన్నారు.

గిరిజన ఎల్‌టిఆర్ భూములను ఆన్‌లైన్ చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజన సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వంకవారి గూడెం పంచాయతీలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జ్యోతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములను ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో ఎక్కించలేదని అన్నారు. అదేవిధంగా ఎస్‌డిసి కోర్టులో గిరిజనులకు అనుకూలంగా తీర్పు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రెవెన్యూ రికార్డులలో ఎక్కించి, అర్హులైన వారికి పట్టలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజా కుమారి, కోర్స దుర్గారావు, తెల్లం లక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

మండలాభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

మండవల్లి : పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపిపి పెద్దిరెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు మూడు నెలల కాలంలో చేసిన పనులను రానున్న మూడు నెలల కలంలో చేయాల్సిన పనుల ప్రణాళికలను ఎంపిపి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని గ్రామాలలో కుక్కలు ఎక్కువైపోయాయని, ప్రజలను వెంటబడి గాయపరుస్తున్నాయని, దోమల బెడద ఎక్కువగా ఉందని, పట్టపగలే దోమలు ముసురుతున్నాయని, ఇక రాత్రి వేళల్లో కంటిమీద కునుకు ఉండడం లేదని సర్పంచులు ఎంపిపి వద్ద వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని అన్నారు. మండలంలోని పాఠశాలలు, అంగన్వాడీల అభివృద్ధికి అధికారులు, నాయకులు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సాధారణ నిధులను 15 శాతం వరకు వినియోగించుకుని సమస్యను పరిష్కరించుకోవచ్చునని శేఖర్ తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయ నిర్మల పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

ముదినేపల్లి : విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ మండలంలోని వణుదుర్రు, దేవపూడి గ్రామాల్లో బుధవారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. విద్యుత్ భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉల్లంకి నాంచారయ్య, మట్లపూడి కనకారావు, చిన్నం మాధవ, బండి సంధ్యా రాణి, లక్ష్మణరావు, దాసరి సత్యనారాయణ, వెంకటరత్నం, పీతల అన్నపూర్ణ, కోటే సువర్ణ, విజయ పాల్గొన్నారు.

కలిదిండి : విద్యుత్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. మండలంలోని మూలలంక, కలిదిండి గ్రామాల్లో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని నిరసిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేసి విద్యుత్ ఛార్జీలపై వ్యతిరేకతను తెలియజేయాలని కోరారు. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపి అదానీకి దోచిపెట్టడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని చెప్పిన మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు జక్కుల మహేష్, సిహెచ్.శ్రీకాంత్, పి.సత్యన్నారాయణ, ఎస్ఎన్‌వి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

12న జిల్లాస్థాయి పాటల పోటీలు

ప్రజాశక్తి - చింతలపూడి

యువత పెడదోవ పట్టకుండా ఆనంద మనోహర ట్రస్ట్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహించబడుతుందని ట్రస్ట్ అధ్యక్షులు మళ్లగిరి ఇమ్మాన్యుయేల్ సంఘాల నాయకులు ఎం.వరలక్ష్మి దేవి అన్నారు. ఈమేరకు మండలంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యాన బుధవారం ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వబడునని ప్రచార కరపత్రం విడుదల సందర్భంగా నిర్వాహకులు తెలియజేశారు. ఈనెల 12వ తేదీ శ్రోతలు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంతెనాల అభిమానులు దాసోహం వీరభద్ర చారి, ఎం.వెజేస్, పి.సత్యనారాయణ, ఎస్.కె.సుభాని, వసంతరావు, ఆర్‌వీఎస్.నారాయణ పాల్గొన్నారు.

ఆకుకూరలు పంపిణీ చేస్తున్న అంగన్వాడీలు

పోషణ వాటికలతో ఆరోగ్యం పదిలం

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోషణ వాటికల నిర్మాణం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి అన్నారు. మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం, కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం బాలింతలు, గర్భిణులకు ఆకుకూరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఆరేళ్ల లోపు చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు బలవర్ధకమైన ఆహారం అందించే క్రమంలో అంగన్వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర, చుక్కకూరలతో పాటు కూరగాయలు బెండ, వంగ, చిక్కుడు, టమాట, బీర మొదలైన కూరగాయలను పండించి పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలోని పోషణ వాటికలూ 12 అంగన్వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయని తెలిపారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని 0–6 పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. ఆకుకూరలు, కూరగాయలతో రక్తహీనత నివారించవచ్చునని తెలిపారు. కొత్తగూడెం అంగన్వాడీ కార్యకర్త పి.పోసమ్మ పాల్గొన్నారు.

చనుబండలో 'పొలం పిలుస్తుంది'

చాట్రాయి : సస్యరక్షణ చర్యలు తీసుకొని మొక్కజొన్న పంటను చీడ పీడల నుంచి కాపాడుకొని, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు సూచించారు. బుధవారం చనుబండ మండలంలోని చనుబండ గ్రామంలో మండల ఎఇఓ ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చనుబండ గ్రామంలో రైతులతో కలసి మొక్కజొన్న పంట చేను ఎఇఓ, విహెచ్‌ఎ పరిశీలించారు. పంటలో ఉన్న పురుగుకు ఏ పురుగు మందులు ఎంత మోతాదులో పిచికారి చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలను పాటించి మెరైన యాజమాన్య పద్ధతులు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చని ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ టి.శివశంకర్, కూటమి నాయకులు ప్రదీప్, గవర వెంకటేశ్వర రావు, బన్ని గోపాలకృష్ణ, మోరంపూడి. రమేష్, రైతులు పాల్గొన్నారు.

'భూమిని తిరిగి ఇచ్చేయండి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని విజయవాడ రోడ్ గల కృష్ణా విలాస్ కాలనీలోని సుమారు 10 సెంట్లు స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ భవన నిర్మాణకు బొబ్బిలి కుటుంబీకులు విరాళంగా అందించారు. అద్దె భవనంలో ఇబ్బందులకు గురవుతూ భూములు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి సరైన వసతులు లేకపోవడం, మరో వైపు ఇరుకు మార్గాల్లో రాకపోకలకు అంతరాయాన్ని గమనించి నాడు కీర్తిశేషులు బొబ్బిలి వాసు జ్ఞాపకార్థం ఉచితంగా ఇచ్చిన స్థలంలో నేటికీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంపై దాతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ భవన సముదాయం నిర్మాణం ముందుకు రానప్పుడు తాము బహూకరించిన భూమిని తిరిగి తమకు అప్పగించవలసిందిగా దాత బొబ్బిలి సునీత నూజివీడు ఆర్‌డిఒ కార్యాలయంకు తెలియజేశారు.

'పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మండల రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షులు జి.రత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పి.రామ రాజేశ్వరి, కె.కుటుంబరావు ఆర్థిక సహకారంతో తయారుచేసిన లంచ్ బ్యాగులను, సిఎల్ బుక్, క్యాలెండర్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ హరిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల బాబురావు, ఆర్థిక కార్యదర్శి కె.నాగరాజు, మండల ఉపాధ్యక్షులు ఎమ్.రవికిరణ్, మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సంఘ నాయకులు

నేరాలు - ఘోరాలు

ఏడుగురిపై బైండోవర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నేరుమునకు పాల్పడిన ఏడుగురిని 129 బిఎన్ఎస్ఎస్ యాక్ట్‌పై నూజివీడు తహశీల్దార్ కార్యాలయం వారి ఎదుట బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తాన్‌య్య తెలిపారు. ఈ సందర్భంగా బైండోవర్ అయిన వారిని నూజివీడు తహశీల్దార్ వీరి మరలా నేరాలకు పాల్పడితే లక్ష జరిమానా, ప్రభుత్వం వారు అందించే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు.

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారి పైనా, నాటు సారాయి తయారీ చేస్తున్న, అమ్మినా, కలిగి ఉన్న నేరమైన నాటుసారాకు తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం స్టాక్ చేసే బెల్లం వ్యాపారుల పైనా, నాటు సారాయి తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట కలిగి ఉన్న ఘ యజమానులపైన కూడా కేసులను నమోదు చేస్తామని, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440902462కు సమాచారం తెలియజేయాలన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సిఐ మస్తాన్‌య్య తెలిపారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ వి.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుమల దేవి పేట గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం తన సిబ్బందితో దాడి చేసి రూ.6,500 విలువ గల మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజా శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయం

శాశ్వత సచివాలయం, హైకోర్టుల నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళం సేకరణే లక్ష్యం

వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి



సిఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వారసత్వం అంటే వైద్య సేవలందించాలని, వారు నిర్దేశించిన విలువలు, వ్యక్తిత్వాన్ని కూడా స్ఫూర్తిగా తీసుకోవడం, ఆ దారిలోనే అడుగులు వేస్తున్నారు కొందరు. నిరాడంబరమైన జీవన శైలిలోనూ తండ్రిని అనుసరిస్తూ.. నేటితరానికి ప్రేరణగా నిలుస్తున్నారు వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి. సేవా కార్యక్రమాల్లో తండ్రి డాక్టర్ అంబుల మనోజ్‌కి తగ్గ తనయగా వైష్ణవి మంచి మనసుని చాటుకుంటోంది. జిల్లాలోని ముదినేపల్లిలో వైద్య విద్యను అభ్యసిస్తున్న అంబుల వైష్ణవి తన చిన్నతనం నుంచి తండ్రి డాక్టర్ మనోజ్‌లోని సేవా గుణాన్ని అలవర్చుకుని, తండ్రి సహకారంతో నిత్యం నేటికీ ఎన్నో, ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులు మత్తుమందులకు, మద్యానికి, చెడు వ్యసనాలకు లోనై జీవితాలు దుర్భరం చేసుకుంటున్న నేపథ్యంలో వైష్ణవి దీనికి భిన్నంగా నేటి సమాజంలో పేదలకు, దిక్కులేని వారికి, వితంతువులకు, అభాగ్యులకు సేవ చేయడమే తన వైద్యవృత్తిగా ఎంచుకుని, వారి సొంత ఆస్తులని అమ్మి అవసరమైన వారికి, పేదలకు నగదు, నిత్యవసర సరుకులను ఇస్తూ.. తానే కాకుండా ఇంకా మరి కొంతమంది సేవాగుణం అలవర్చుకొని ఇతరులకు సహాయపడాలని హితవు పలుకుతూ.. ముందుకు సాగుతుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం తన ఆలోచనా విధానం, తన వంతు ఆర్థిక సాయం చేస్తున్నారు. 2025 నూతన సంవత్సరంలో అమరావతి అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని, పరిశ్రమలు రావాలని, పోలవరం త్వరితగతిన పూర్తి కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ సంక్షేమ ఫలాలు, సంక్షేమ పథకాలు అందుకుని క్షేమంగా జీవించాలని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో అభివృద్ధి దిశగా.. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో, అత్యున్నత స్థాయిలో ఉంచాలని, ఇదంతా రాష్ట్ర ముఖ్యమంత్రి, విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు ఒక్కరి వల్లే జరుగుతుందని రాష్ట్ర ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నారు. ముదినేపల్లి మండలాన్ని పూర్వపు మాదిరి కృష్ణా జిల్లాలో చేర్చాలని మండల ప్రజలందరూ కోరుతున్నారు. హై కమాండ్ దృష్టికి తీసుకువెళ్లి, ప్రజల ఆకాంక్ష నెరవేర్చడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్ర శ్రేయస్సు కోసం ఈ సంవత్సరంలో తన స్వగ్రామం ముదినేపల్లిలోని తన ఇంటి ఆవరణలో ఉన్న ఏడుకొండల వారి సన్నిధిలో రాజశ్యామల యాగం చేసే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు వచ్చి, ఈ గొప్ప పూజా కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించాలని, సిఎం దంపతుల పాదాలు కడిగి వారి ఆశీర్వచనములు పొందాలనే సంకల్పంతో కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు అంబుల వైష్ణవి.

నాన్న బాటలో పయనం

అంబుల వైష్ణవి, అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని

చిన్నతనం నుంచి సమాజసేవ అంటే ఎంతో మక్కువ. చదువుకున్నప్పటి నుంచి సేవాగుణం అలవడింది. నాన్న నుంచి నిరాడంబరత నేర్చుకున్నా. పరోపకార గుణమే గొప్ప ఆభరణమనేది నా నమ్మకం. తండ్రి వైద్యమే కాదు, ఆయన వ్యక్తిత్వాన్నీ పుణికిపుచ్చుకున్నాను. ఇప్పటి వరకు జూన్ 22న ఒక ఎకరం అమ్మి రాష్ట్ర రాజధాని కోసం రూ.25 లక్షల విరాళం, బంగారపు గాజులు అమ్మి పోలవరం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం అందించా. అక్టోబర్ 22న అరఎకరం అమ్మి శాశ్వత సచివాలయం, హై కోర్టుల నిర్మాణానికి గోల్డ్ చైన్ అమ్మి లక్ష రూపాయల విరాళం అందించా. అమరావతి రాజధానిలో 108 అడుగుల వెంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేపట్టాలనేది ఆకాంక్ష. శాశ్వత సచివాలయం, హైకోర్టుల నిర్మాణానికి మా వంతుగా రూ.100 కోట్ల విరాళం సేకరించి ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నాను.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఏలూరు సిటీలో చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆపద సమయంలో అందించే సాయం అవసరార్థులకు అత్యంత ఉపయుక్తమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 9 మందికి రూ.11 లక్షల 74 వేల 8 వందలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ బడేటి చంటి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న పేదలకు అనారోగ్య పరిస్థితులు మరింత భారం కాకూడదనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వాధినేతలు గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్‌టిఆర్ వైద్యసేవల్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అయితే ఆ సేవల పరిధిలోకి రాని వైద్యసేవలను కూడా పేదలకు అందాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఏలూరు నియోజకవర్గంలో సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులకు అందజేసినట్లు ఎంఎల్ఎ చంటి తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పైల వెంకట్రావు రూ.25 వేలు, బొమ్మన హేమలత రూ.27 వేలు, కూరేటి కనకదుర్గ రూ.50,999, షేక్ రిజ్వాన రూ.3,08,615, తుపాకుల ప్రసాద్ రూ.లక్ష, పాయం లక్ష్మి రూ.4 లక్షలు, బోళ్ల శ్రీనివాస్ రూ.1,07,980, ఉప్పుటూరి వెంకట లక్ష్మి, అంజనాదేవి రూ.55,206, చెన్నకేశవుల మంగాదేవి రూ.లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు. కాగా ఒకపక్క అనారోగ్యంతో, ఇంకోపక్క ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం కొండంత ధైర్యాన్నిస్తుందని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రూ.8.45 లక్షల సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఉంగుటూరు : ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదుగురు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి రూ.8.45 లక్షల చెక్కులు అందించారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ నియోజకవర్గంలో రూ.60 లక్షలకుపైగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించి, బాధితులకు స్వాతన చేకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొతూర్తి కృష్ణంరాజు, జనసేన మండల అధ్యక్షుడు పి.రాంబాబు, ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

విద్యాసామగ్రి వితరణ చేసిన ఎస్‌బిఐ

పాఠశాలల అభివృద్ధికి బ్యాంకుల సహకారం అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు వాణిజ్య బ్యాంకులు సైతం భాగస్వాములు కావడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎస్‌బిఐ నారాయణపురం శాఖ కోఆపరేటివ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సిఎస్‌ఆర్) కింద సుమారు రూ.5 లక్షలతో నారాయణపురం కొబ్బరితోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యాసామగ్రి అందజేశారు. బుధవారం గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కంప్యూటర్లు, టేబుల్స్, కుర్చీలు, వంట పాత్రలు తదితర మౌళిక సదుపాయాలను కల్పించారు. ఆర్‌బిఐ ప్రసాద్, ఎల్‌కెఎంవి నోరి, బ్రాంచ్ మేనేజర్ కృష్ణచైతన్య, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాజారావుకు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో జిల్లాకు చెందిన ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావుకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఉద్యమ గీతాల విభాగంలో ప్రథమ బహుమతి, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన బుర్రకథ విభాగంలో అతని బృందానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కాకినాడలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన స్వర్ణోత్సవ సంబరాలలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్న జొన్నకూటి రాజారావుకు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్క వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫ్ అలీ, ఆర్.రవికుమార్, జిల్లా కార్యవర్గం, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

బహుమతి అందుకుంటున్న రాజారావు

ఘనంగా ఎంఎల్ఎ బాలరాజు పుట్టినరోజు

జీలుగుమిల్లిలో..

టి.నరసాపురం : పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పుట్టినరోజు సందర్భంగా జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండలం నుంచి జనసేన, టిడిపి, బిజెపి కూటమి నేతలు బుధవారం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాజుపోతేపల్లి నుంచి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు తన అనుసరులతో తరలి వెళ్లగా జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు జనసేన నాయకులతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలో భారీ ర్యాలీగా బయలుదేరి పుట్టినరోజు వేడుకల వరకు ప్రదర్శనగా వెళ్లి బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. జయవరపు శ్రీరామూర్తి, బొంతు సత్యనారాయణ, పిన్నమనేని మధు, గంటా సతీష్, నాళం కాశీ, ప్రసాద్ ఉన్నారు.

జీలుగుమిల్లి : పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జన్మదిన వేడుకలు బుధవారం బర్రింకలపాడులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజులు హాజరై బాలరాజుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిర్రి చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. అనంతరం సిబిఆర్ క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఎంఎల్ఎ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన క్రీడలలో వేలేరుపాడు మండలానికి వాలీబాల్ గేమ్‌లో మొదటి బహుమతి లభించింది. తరువాత ఆర్చరీ మద్దిగట్ల గ్రామానికి చెందిన సోడే వెంకటేశు, సోడే దుర్గారావు, ప్రొఫెషనల్ భాగంలో పాయం రమేష్‌కు ఎంఎల్ఎ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గీతాంజలి విద్యాసంస్థల ఆధ్వర్యంలో చేబ్రోలులో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా గ్రైండర్, రెండో బహుమతిగా మిక్సి, మూడో బహుతిగా రైస్ కుక్కర్, నాలుగో బహుమతిగా కుక్కర్, ఐదో బహుమతిగా నాన్‌స్టిక్ పాన్ అందజేశారు. చేబ్రోలు, నారాయణపురం సర్పంచులు రాందే లక్ష్మి సునీత, దిడ్ల అకనంద, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని పరమేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న న్యాయ నిర్ణేతలు

చింతలపూడి : మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని ఎపిఆర్ గర్ల్స్ స్కూల్ ప్రిన్సిపల్ బ్రాహ్మణేశ్వరి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం స్కూల్‌లో బుధవారం సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బోగి మంటలు, గాలిపటలు కోలాహలంగా పండుగను నిర్వహించారు. అరిసెలు, పిండి వంటలు విద్యార్థులు అందజేశారు. హరిదాసుని వేషం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మన సాంప్రదాయలు తెలుసుకోవాలని అన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, ఉమెన్ ఎంపవర్మెంట్, కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు విద్యార్థులు ముందు తరాల వారికి అందించాలనే ఉద్ధేశంలో కళాశాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం అనేది చాలా ఆనందదాయకమని హర్షం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రంగవల్లులు చూసి, సంక్రాంతి పండుగను తలపిస్తూ ఈ ప్రాంగణం మొత్తం కూడా ఆనందదాయకంగా ఉందని వారి సంతోషాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. భోగి మంటలు, పాలు పొంగలి, పచ్చ తోరణాలు, రంగవల్లులు, గాలిపటాల పోటీ, మెహందీ, మ్యూజికల్ ఛైర్స్ మొదలైన అన్ని కార్యక్రమాలు విద్యార్థులు కలిసి మెలిసి చేసి అధ్యాపకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి కోకోకోలా కంపెనీ వారు వచ్చి స్వయంగా వారి చేతుల మీదుగా బహుమతులు అందజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పుస్తకాలు బహూకరిస్తున్న దాతలు

గ్రంథాలయానికి పోటీపరీక్షల పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని కేంద్ర గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను గుడిమెట్ల అచ్యుత, సత్యదేవ దంపతుల కుమారులు అభిరాం, కౌశిక్‌ల పుట్టినరోజు సందర్భంగా డిఎస్‌సి, గ్రూప్స్‌నకు సంబంధించి సుమారు రూ.30 వేలు విలువచేసే పుస్తకాలను బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పుస్తకాలు బహుకరించిన దాతలకు గ్రంథాలయ సిబ్బంది సన్మానం చేశారు. అనంతరం కార్యదర్శి సభను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు గ్రూప్స్, డిఎస్‌సికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కాబట్టి వీటిని వినియోగించుకొని, విద్యార్థులు మంచి విద్యావంతులుగా ఉద్యోగాలు సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు ప్రెసిడెంట్ విశాలాక్షి, పిడిసి గుడిమెట్ల అచ్యుత, సెక్రెటరీ లక్ష్మీ సర్వేష్, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ పాల్గొన్నారు.

ప్రతి రైతు పంట బీమా చెల్లించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి ఒక్క రైతు తాము వేసిన పంటకు బీమా చేయించుకున్నట్లయితే పంట నష్టపోయిన సమయంలో ఆర్థికంగా ప్రభుత్వం రైతుకు ఒక భరోసాలా ఉపయోగపడుతుందని మండల ఎఒ సూరిబాబు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని గ్రామ సచివాలయంలో రైతులు తాము వేసిన పంటలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్క రైతు ఆ పంటను బట్టి ప్రీమియం చెల్లించుకుని, నష్టపోయిన సమయంలో నష్ట పరిహారం పొందటానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నత శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రావిచెర్లలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని రావిచెర్ల గ్రామంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాపా శ్రీనివాస్ రావు రావిచెర్ల గ్రామంలోని ప్రధాన సమస్య అయిన రెవెన్యూ గ్రామం కాకపోవటంతో ఈ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చాలని, గత ప్రభుత్వం ఇచ్చిన డిఫామ్ పట్టాలలో అవకతవకలు ఉన్నాయని, వాటిని సరిచేసి, సబ్ డివిజన్ చేసి, రైతులకు అప్పగించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవికిరణ్ సింగ్, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, పాలక సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులు మండలంలో ముగిశాయి. మండలంలోని దేవపూడి, ప్రొద్దువాక గ్రామాల్లో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ జె.ఎస్.సుభాని, మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్, రీసర్వే డిటి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు దాసరి కాశీ అన్నపూర్ణమ్మ, విఆర్‌ఒ సుధీర్ పాల్గొన్నారు. గతనెల 11న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. మండల వ్యాప్తంగా 33 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వివిధ సమస్యలపై 390 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ సుభాని తెలిపారు.

టిడిపి క్యాలెండర్ ఆవిష్కరణ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం టిడిపి నూతన క్యాలెండర్‌ను బుధవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ చేతుల మీదుగా బయ్యనగూడెం గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మాజీ ఎఎంసి ఛైర్మన్ పారెపల్లి రామారావు ఇంటివద్ద నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ కూడా పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి పుట్టా మహేష్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఆయన జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని విశ్వసించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, పారెపల్లి రామారావు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు దివ్య సముఖమునకు

GWOP.No.36/2024

మధ్య
గిద్దా శ్రీనివాసు ...పిటీషనరు
మరియు
గిద్దా కార్తికేయ (మైనరు)
మైనరు తరపున గార్డియన్ అయిన తల్లి
గిద్దా నాగసుధ అనే సజ్జా నాగసుధ
...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటిషనులో నా క్లయింటు గిద్దా శ్రీనివాసు అను వ్యక్తి మీపై గార్డియన్ పిటిషనున్ను ది.4-10-24 తేదీన దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో శ్రీకోర్టు వారు జనరల్ నోటీసు ప్రకటన వేయమని ఆదేశించగా ఈ ప్రకటన ద్వారా తమకు వాయిదా ది.**10-2-2025** తేదీన వాయిదా అని తెలియజేయుచూ GWOP.36/2024 లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు స్వయముగా కాని వకీలు ద్వారా కాని ఉదయం 10.30 నిమిషాలకు హాజరయి తెలియపరచవలసినదిగా తెలియ జేయడమైనది. లేనిఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

Palepu Venkata Satyanarayana
Advocate,
Tadepalligudem.
Cell: 9963346059.
తాడేపల్లిగూడెం.
తేది.2-1-2025